బ్రహ్మచారిణి.. కిరీటధారిణి


బ్రహ్మచారిణి అలంకరణలో శుభానందదేవీ

కాళేశ్వరం, మహదేవపూర్, న్యూస్‌టుడే : కాళేశ్వర క్షేత్రంలో విశేష పూజలు, హోమ క్రతువుల మధ్య శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం శుభానందదేవీ, సరస్వతీదేవీలు బ్రహ్మచారిణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహదేవపూర్ మండల కేంద్రంలో దుబ్బగూడెం, గంగాదేవి ఆలయం, గర్భగౌరి సంస్థాన్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు అన్నపూర్ణదేవి అవతారంలో దర్శనమిచ్చారు. సామూహిక లలిత సహస్రనామ పారాయణం చేశారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భూపాలపల్లిలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీ అవతారంలో దర్శనమిచ్చారు.


కన్యకాపరమేశ్వరీ ఆలయంలో


మహదేవపూర్ గంగాదేవి గుడిలో..


భూపాలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి కోసం ఇలా నిర్మించారు. నల్లాలు, నీటి సరఫరా కోసం పైపులైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.


మహాముత్తారం మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న డైనింగ్ హాలు ఇది.. రూ.13 లక్షల నిధులు కేటాయించారు.. కేవలం రూ.5 లక్షలు మాత్రమే చెల్లించారు. మిగతా బిల్లు రాకపోవడంతో పనులు నిలిపివేశారు.


రేగొండ మండలం మడ్తపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో అసంపూర్తిగా దర్శనమిస్తోన్న మరుగుదొడ్ల నిర్మాణం

నిధులు కొరవడి.. పనులు చతికిలబడి!

పరిశీలన

ఈనాడు డిజిటల్, జయశంకర్ భూపాలపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మెరుగైన సౌకర్యాల కోసం గత ప్రభుత్వం 2021-22లో 'మన ఊరు-మన బడి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా ప్రారంభించగా.. పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో బడుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. మన ఊరు- మన బడి పథకం పనులను వదిలేయడంతో పనులు అసంపూర్తిగా వెక్కిరిస్తున్నాయి. జిల్లాలో ఈ పథకం కింద మొదటి విడతగా మొత్తం 149 పాఠశాలలను ఎంపిక చేశారు. అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్ హాళ్లు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్తు సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం, ఇతర పనులు, మరమ్మతులు చేపట్టాలి. ఫర్నిచర్ డెస్కులు, గ్రీన్ బోర్డులు, టేబుళ్లు, కుర్చీలు, ఇలా, ఇతరత్రా సదుపాయాలు కల్పించాలి.

అయితే ఎంపిక చేసిన పాఠశాలల్లో గతేడాదే పనులు పూర్తికావాల్సి ఉన్నా.. జాప్యం అయ్యాయి. ఈ ఏడాది పాఠశాలలు పునఃప్రారంభం సమయంలోనైనా పూర్తవుతాయని భావించినా పనులు పూర్తికాలేదు. ఇప్పటివరకు పూర్తయినవి కేవలం 51 మాత్రమే.. 30 పాఠశాలల్లో 70 శాతం పనులు పూర్తయ్యాయి. మిగతా కొన్ని ఆరంభానికి నోచుకోలేదు.. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. పాఠశాలలకు సివిల్ పనుల కింద రూ.22.86 కోట్లు, ఉపాధిహామీ పథకం కింద రూ.18.95 కోట్లు కేటాయించారు. చేసిన పనులకు ఇప్పటివరకు రూ.11.60 కోట్లు చెల్లించారు. ఇంకా చేపట్టిన రూ.2.26 కోట్ల బిల్లులు రావాల్సి ఉంది. గుత్తేదారులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు.


ఇది మహాముత్తారం మండలం నల్లగుంట మినాజిపేట డైనింగ్ హాలు.. పునాదుల్లోనే ఆగిపోయింది. పిల్లర్ల వరకు చేసిన పనులకు బిల్లులు కూడా రాలేదు.


ఇక్కడ అసంపూర్తిగా కనిపిస్తున్న నిర్మాణం భూపాలపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మన ఊరు-మన బడి పథకంలో భాగంగా నిర్మించిన డైనింగ్ హాలు, ఫ్లోరింగ్, పైపులైన్, ప్లంబర్ పనులు చేయాల్సి ఉంది, టేబుళ్లు, కుర్చీలు సమకూర్చాల్సి ఉంది. రూ.80 లక్షలు కేటాయించినా బిల్లులు చెల్లింపుల్లో జాప్యంతో పనులు ఆగిపోయాయి.

సెలవుల్లో పూర్తిచేస్తే మేలు..

దసరా సెలవుల్లో పనులు తిరిగి చేపడితే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. కొన్నిచోట్ల సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాలి..

-రాజేందర్, డీఈఓ, భూపాలపల్లి

మన ఊరు-మన బడి కింద ఎంపికైన పాఠశాలల పనులు చాలాచోట్ల ఆగిపోయిన మాట వాస్తవమే. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మన ఊరు-మన బడి కింద చివరి దశలో ఉన్న వాటిని పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే వాటి పనులు కూడా చేపట్టి పూర్తిచేస్తాం.

చెరువులను కాపాడుకుంటేనే మనుగడ


గణపసముద్రం చెరువులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పక్కన కలెక్టర్ రాహుల్ శర్మ

గణపురం, న్యూస్‌టుడే: 'చెరువులే మన జీవనాధారం.. గత ప్రభుత్వ హయాంలో చెరువులన్నీ అన్యాక్రాంతమయ్యాయి. వాటిని కాపాడుకోకుంటే భవిష్యత్తు తరాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని' రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం గణపురం మండలం గణప సముద్రం చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా చేప పిల్లల విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, కలెక్టర్ రాహుల్ శర్మ, రాష్ట్ర ఫిషరీస్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మన్ సాయికుమార్‌తో కలిసి చెరువులో చేప పిల్లలను వదిలారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి వందశాతం రాయితీతో చేప పిల్లలను చెరువుల్లో విడుదల చేస్తున్నామని చెప్పారు. గణప సముద్రంలో 51,800 చేప పిల్లలను వేశామని.. మత్స్యకారులు ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు జలాశయాల్లో చేపల ఉత్పత్తి పెంచేందుకు దోహదపడుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నీలి విప్లవం రావాలని, తద్వారా మత్స్యకారుల అభివృద్ధి జరుగుతుందన్నారు. చెరువుల ఎగువన పంట పొలాల్లో మందు చల్లిన నీరు చెరువుల్లోకి చేరడంతో చేపలకు ప్రమాదం వాటిల్లుతుందని, అలా నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గొర్రెలు, చేపల పంపిణీలో అవినీతికి పాల్పడ్డారని.. ఈ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తూ నాణ్యత గల చేప పిల్లలను చెరువులో వేస్తున్నామన్నారు. గతేడాది వచ్చిన వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, నీటిపారుదల పథకాలకు మరమ్మతు చేపట్టాల్సి ఉందని, త్వరలోనే పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మత్స్య శాఖ సహాయ సంచాలకులు హనుమంతరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాశ్, మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారంతో సర్వే


సర్వే రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఆర్డీవో మంగీలాల్

భూపాలపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ కార్డు కోసం చేపడుతున్న సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు లక్ష్మినగర్‌లో పిల్లలమర్రి రాజయ్య, తోట సుగణ ఇళ్లలో అధికారులు ప్రయోగాత్మకంగా చేపడుతున్న డిజిటల్ సర్వేను కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి కుటుంబంలో మొత్తం సభ్యుల వివరాలు నమోదు చేయాలని, వారి ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నంబర్లు, వయసు తదితర సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని చెప్పారు. గణపురం మండలం బుర్రకాయలగూడెంలో 161 గృహాలు, మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డులో 181 గృహాలకు సంబంధించి కుటుంబ సభ్యుల సమాచారాన్ని సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అధికారులకు సహకరించాలని, ఈ నెల 7వ తేదీలోగా డిజిటల్ సర్వే పూర్తి చేయాలని సంబంధిత నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సర్వేలో ఎటువంటి సందేహాలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్డీవో మంగీలాల్, తహసీల్దారు శ్రీనివాసులు, ఆర్‌ఐ రామస్వామి, కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రగతికి ప్రతిపాదనలివ్వండి


గోదావరి వద్ద పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలివ్వాలని కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ సూచించారు. శుక్రవారం పాలనాధికారి సమక్షంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించాల్సి ఉండగా, అనివార్య కారణాలతో పాలనాధికారి రాహుల్‌శర్మ హాజరుకాకపోవడంతో మయాంక్ సింగ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈవో ఎ.మారుతి పలు నిర్మాణాలకు సంబంధించి వివరించారు. ఇటీవల దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్ కాళేశ్వర క్షేత్రంలో సమీక్ష నిర్వహించగా అస్తికల నిమజ్జనం భక్తులకు తప్పనిసరిగా దేవస్థాన అతిథి గృహాలు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో త్రివేణి అతిథి గృహానికి సమీపంలో నిర్మాణాలు పూర్తయిన పిలిగ్రిమ్ ఎనిమిటీ సెంటర్ భవనాన్ని కేటాయిస్తున్నట్లు ఈవో తెలిపారు. అస్తికలను భద్రపర్చుకోవడానికి 50 లాకర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రధానమైన 100 గదుల అతిథి గృహం దీర్ఘకాలంగా జాప్యం జరుగుతుండంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని అన్నారు. కాళేశ్వరం ప్రధాన రహదారి వెంట వెళ్తున్న మురుగు మధ్యలోనే సంగమేశ్వరాలయం వద్ద నిలుస్తుండటంతో తీవ్ర దుర్గంధం నెలకొందని, కాల్వను గోదావరి తీర ప్రాంతం వైపు మళ్లించి సంపు ఏర్పాటు చేస్తే సమస్య తీరుతుందని స్థానికులు సబ్ కలెక్టర్‌కు వివరించారు. తీరం వద్ద ఉన్న సులభ్ కాంప్లెక్సు వినియోగాన్ని నియంత్రించి ఆ స్థానంలో మహిళలకు దుస్తుల మార్పిడి కోసం వినియోగించేలా ప్రతిపాదనలు చేశారు. తీరం వద్ద షవర్లు, సాధారణ పుష్కర ఘాట్‌కు కుడివైపు సులభ్ కాంప్లెక్సు నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. అవసరమైన భూమి కొనుగోలు, ఇతర నిర్మాణాలకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సబ్ కలెక్టర్ అధికారులకు సూచించారు.

కొనసాగుతున్న ధ్రువీకరణ పత్రాల పరిశీలన


భూపాలపల్లి, న్యూస్‌టుడే : డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన మూడో రోజు శుక్రవారం భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగింది. ఎస్జీటీ అభ్యర్థులు 1:3 ప్రకారం మొత్తం 393 మంది హాజరుకావాల్సి ఉండగా ఈ రోజు వరకు 338 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.రాజేందర్ తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లు, మిగిలిన కేటగిరీల్లో 188 అభ్యర్థులకు 154 మందికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాల పరిశీలన పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. శనివారం చివరి రోజు కావడంతో తప్పనిసరిగా అభ్యర్థులు హాజరై ధ్రువీకరణ పత్రాలు పరిశీలింపజేసుకోవాలని సూచించారు.

ధాన్యం దిగుబడి అంచనా మేరకు కొనుగోళ్లు

భూపాలపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే : ధాన్యం దిగుబడి అంచనా మేరకు కొనుగోళ్లకు సిద్ధంకావాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, పౌరసరఫరాలు, మార్కెటింగ్, సహకార, పరిశ్రమల, డీఆర్డీఏ శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాల కల్పన, కేంద్రాల ఇన్‌ఛార్జిలకు శిక్షణ తరగతుల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1,05,650 ఎకరాల్లో వరి సాగైందని.. దాదాపు 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అంచనా మేరకు 300 కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. గన్నీ సంచులు, తూకపు యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, తేమ నిర్ధారణ యంత్రాలకు ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. గతేడాది ఏ కేంద్రాల్లో ధాన్యం ఎక్కువగా వచ్చిందో అంచనా ప్రకారం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రభుత్వం సన్నధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించినందున సన్న, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు విడివిడిగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, పౌరసరఫరాల సంస్థ డీఎం రాములు, డీఏవో విజయ్ భాస్కర్, సహకార అధికారి వాలియా నాయక్, మార్కెటింగ్ డీఎం కనకశేఖర్, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.

రైతు ధర్నా విజయవంతం..

భారాస శ్రేణుల్లో ఉత్తేజం


మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై పార్టీ నాయకులు

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు మహా ధర్నా విజయవంతం కావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. వేలాదిగా తరలివచ్చిన రైతులతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలుచేయాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలు ప్రసంగించారు.


సభకు హాజరైన రైతులు

☛ రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అంటూ బోగస్ మాటలు చెప్పిన మోసకారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. 11 పర్యాయాలు రూ.72 వేల కోట్ల రైతుబంధును అందించిన ఘనత భారాస ప్రభుత్వానికే దక్కుతుంది.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

☛ తొర్రూరులో గురువారం ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో వేదిక కూలిపోయిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటపడి వేటాడుతాం.

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి

☛ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కి రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగిస్తున్నారు. రుణ మాఫీపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్‌రెడ్డిలు పొంతనలేని లెక్కలు చెబుతున్నారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.

- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి


☛ నేటికి 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి, పాలకుర్తిలో 50 పడకల ఆసుపత్రి పనుల ఊసేలేదు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటాం.

- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఆర్టీసీలో మహాలక్ష్మి!



● సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర



ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాట పట్టింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం రెట్టింపయ్యింది. అయితే సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఉత్తమ సేవలతో పాటు మంచి లాభాలు ఆర్జించడంలో మహిళా ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కండక్టర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అన్ని విభాగాల్లో సత్తా చాటుతున్నారు.

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల పరిధిలో మహిళా కండక్టర్లు 479 మంది ఉన్నారు. ఇతర విభాగాల్లో పని చేసే వారు మరో 32 మంది ఉంటారు. వీరిలో ప్రధానంగా వరంగల్ 2, జనగామ, తొర్రూరు, నర్సంపేట డిపో మేనేజర్లు జ్యోత్స్న, స్వాతి, పద్మావతి, ప్రసూనలక్ష్మి, వరంగల్ 2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, హనుమకొండ డిపోలో నాజియా, ఆర్‌ఎం కార్యాలయంలో సరస్వతి, పరకాలలో కృష్ణకుమారి, నర్సంపేటలో భవాని, తొర్రూరులో రజిత, ఎంప్లీ వరంగల్ 2 డిపోలో అమల, పరకాలలో రాజశ్రీ, ఆర్‌ఎం కార్యాలయంలో మహిత లు కీలక పదవుల్లో ఉండి ఆర్టీసీ అభివృద్ధి కృషి చేస్తున్నారు.



మహిళా శక్తి ఇలా..

● పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువ మంది మహిళా కండక్టర్లే విధులు నిర్వహిస్తున్నారు.

● ఆర్టీసీలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉన్నతాధికారులు ప్రతి డిపోకు ఐదుగురు సభ్యులతో కూడిన సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఉమ్మడి జిల్లాలోని 9 డిపోల్లో ఒక్కో బృందంలో ఒక మహిళ సభ్యురాలిగా ఉన్నారు. తొర్రూరు, పరకాల, వరంగల్ 2, జనగామ డిపోల్లో ఇద్దరు సభ్యులు మహిళలే ఉన్నారు. వీరు డిపోల స్థాయిలో కార్మికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను డీఎం, ఆర్‌ఎంలకు చేరవేసి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారు.

● రీజియన్‌లో మహిళా సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రతి డిపోలో ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. మహిళా ఆరోగ్య పరిరక్షణకు ప్రతి డిపోలో ఇద్దరు సహాయకులు సైతం ఉంటారు. వీరు మహిళా సిబ్బందికి వారానికి, నెలకోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి హనుమకొండలోని డిస్పెన్సరీ నుంచి మందులు, తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో అధునాతన చికిత్స అందించేలా కృషి చేస్తున్నారు.



వరంగల్ 1 డిపోలో మహిళల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గది

ఈ సేవలు అందిస్తే మేలు

- రోజుకు 8 గంటల పని దినం కల్పించాలి
- రాత్రి 8 గంటల వరకు తప్పని సరిగా విధులు ముగిసేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రతి నెలా ఆరోగ్య సమస్యలకు మూడు రోజుల పాటు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి.
- పని ఒత్తిడి నివారణకు సిబ్బంది, బస్సుల సంఖ్యను పెంచాలి.
- సిటీ బస్సుల్లో మాదిరిగా స్టాండింగ్ అలవెన్సులు అందించాలి.
- స్పెషల్ ఆఫ్ డ్యూటీ (ఒక రోజు విధులు నిర్వహిస్తే మరో రోజు సెలవు వచ్చేలా) విధులు కేటాయించాలి.

ఉన్నతాధికారుల సహకారంతో..



- జ్యోత్స్న, డిపో మేనేజర్, వరంగల్ 2

ఆర్టీసీ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో డిపో అభివృద్ధికి కృషి చేస్తున్నాం. వారి సూచనలను ఎప్పటికప్పుడు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. మహిళా సిబ్బంది పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తూ డిపో అభివృద్ధికి పాటు పడుతున్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.



- బి.సుధారాణి, కండక్టర్ వరంగల్ 1

మహాలక్ష్మి పథకం వచ్చాక బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో కొంత ఒత్తిడితో పాటు అనారోగ్యానికి గురవుతున్నాం. అయినప్పటికీ సంస్థను తమ సొంతంగా భావించి దాని అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రద్దీని తట్టుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. మా డిపో మేనేజర్ సూచనలతో ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నాం.

పనిభారం ఉన్నా సమర్థంగా విధులు



- రజిత, ట్రాఫిక్ ఎస్‌ఐ, తొర్రూరు డిపో

ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో మహిళా కండక్టర్లు ఒత్తిడికి గురవుతున్నారు. పని భారం పెరుగుతున్నా సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి కేటాయించిన టార్గెట్ పూర్తి చేస్తున్నారు. సంస్థ లాభాల్లో వారి కృషి కీలకం.



త్రివేణి సంగమం

మరో 8 నెలల్లో

సరస్వతి పుష్కరాలు

● ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తే మేలు

న్యూస్‌టుడే, కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం క్షేత్రం వద్ద అంతర్వాహినిగా పేరున్న సరస్వతి నదికి మరో ఎనిమిది నెలల్లో పుష్కరాలు రాబోతున్నాయి. ప్రతి పన్నెండేళ్లకోసారి వచ్చే సరస్వతి పుష్కరాలు వచ్చే ఏడాది మే 15 నుంచి 26 వరకు జరుగుతాయి. 2013లో ఈ నదికి పుష్కరాలు జరిగాయి. కాళేశ్వరం క్షేత్రంలో మూడు నదులు కలుస్తాయి. దీన్ని త్రివేణి సంగమంగా పిలుస్తారు. ఎగువ నుంచి గోదావరి, మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదుల ప్రవాహం రాగా కాళేశ్వరాలయంలోని ద్విలింగాలకు జలాభిషేకం చేసిన నీరు అంతర్వాహినిగా ఈ రెండు నదుల్లో కలుస్తుందని పురాణాల్లో ఉంది. 2015లో గోదావరి, 2022లో ప్రాణహిత పుష్కరాలు జరిగాయి. మరోసారి సరస్వతికి పుష్కర కాలం సమీపించింది. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాల్లో గోదావరి, ప్రాణహిత కలయిక ప్రవాహంలో లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈసారి మరో 8 నెలల సమయమే ఉన్నందున ఆలయ దేవస్థానం అధికారులు, ఇటు ఇతర అధికారులు ముందస్తు ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించొచ్చు.

పూర్తి చేయాల్సిన పనులు..

● గత ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. నిధుల లేమితో నిర్మాణం ఆగిపోగా పంచాయతీరాజ్ అధికారులు గతేడాది అక్టోబర్‌లో మరో రూ.1.5 కోట్ల కోసం జిల్లా పాలనాధికారికి లేఖ పంపించారు. ఇది అందుబాటులోకి వస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.



అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం

● 2013 సరస్వతి పుష్కరాల సమయంలో ప్రయాణ ప్రాంగణం నుంచి గోదావరి వరకు ప్రధాన రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ప్రాణహిత పుష్కరాలకు ముందు ఏర్పాట్లు జరిగినా కొందరు అడ్డు తగలడంతో ఆగిపోయింది. మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుని విస్తరణ పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని భక్తులు కోరుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పలుమార్లు హామీలిచ్చారు. పుష్కరాల నేపథ్యంలో అధికారులు వెంటనే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక నివేదించాలి. తదనుగుణంగా సకాలంలో పనులను పూర్తి చేయడానికి వీలు కలుగుతుంది.

● ప్రముఖుల ఘాట్ వద్ద అంతర్వాహిని సరస్వతి నది ప్రవహించి రెండు నదుల్లో కలుస్తుందని నానుడి ఉంది. ఆ ప్రాంతంలో పుష్కర ఘాట్ నిర్మాణాలు చేపట్టాలి.

● మండు వేసవిలో పుష్కరాలు రానుండగా భారీ సంఖ్యలో గోదావరి తీరంలో, ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలి.

● ప్రధాన ఆలయానికి సమీపంలోని గుండం చెరువును ఆదుకేశవస్వామి పలుమార్లు నాయకులు చెబుతున్నా పనులు సాగడం లేదు. వెంటనే గుండం చెరువును మినీ ట్యాంక్‌బండ్ మాదిరిగా నిర్మాణాలు చేపట్టాలి.

విస్తృత ప్రచారం జరగాలి

సరస్వతి నది పుష్కరాలపై దేవస్థానం అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉంది. దేశం నలుమూలల తెలిసేలా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం జరగాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. గత మంగళవారం పుష్కర ఏర్పాట్లపై దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ హన్మంతరావు సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో పనుల పురోగతిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 2013లో జరిగిన సరస్వతి పుష్కరాలకు మొదటి నాలుగు రోజులు భక్తుల సంఖ్య కేవలం వందల్లో పరిమితం కాగా ఐదో రోజు నుంచి పుంజుకొని వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. రాబోయే పుష్కరాలపై ఇప్పటి నుంచే ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

అవివాహితులకు సువర్ణావకాశం

● నేడు, రేపు ఎస్టీ (బంజార/లంబాడ) కులాల వధూవరులకు

ఈనాడు పెళ్లిపందిరి డాట్ నెట్ ఉచిత నమోదు




బాలసముద్రం, న్యూస్‌టుడే : తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' వేదికగా సువర్ణ అవకాశం కల్పిస్తోంది. ఎస్టీ (బంజారా/లంబాడ) కులాలకు చెందిన అవివాహిత వధూవరుల కోసం ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. హనుమకొండ బాలసముద్రంలోని 'ఈనాడు' కార్యాలయంలో శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం చేపట్టింది. వివాహం కోసం ఎదురు చూస్తున్న వధూవరులు లేదా సంబంధిత కుటుంబీకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5:30 గంటలలోపు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉచితంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఫోన్ ద్వారా నమోదు చేసుకునే వారు తమ బయోడేటా, ఫొటోలను 83744 45190, 80080 02165 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపవచ్చు. మరిన్ని వివరాలకు ఇవే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

ముగ్గురు న్యాయమూర్తులకు పదోన్నతి

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతి లభించింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.శిరీష పదోన్నతిపై సికింద్రాబాద్ సిటీ సివిల్ న్యాయస్థాన ప్రాంగణంలోని 14వ అదనపు కోర్టు జడ్జిగా వెళ్తున్నారు. ములుగు జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి మంచిర్యాల జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వెళ్తున్నారు. జనగామ సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రం అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో జనగామ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత పదోన్నతిపై వస్తున్నారు. వరంగల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్ అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్ పదోన్నతిపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా వెళ్తున్నారు. ఆమె స్థానంలో హనుమకొండ మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి జాబిశెట్టి ఉపేందర్‌రావు వస్తున్నారు. రంగారెడ్డి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.ఉషాక్రాంతి పదోన్నతిపై హనుమకొండ జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌రావు చందన హనుమకొండ జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు.

కాంగ్రెస్ సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత



మరిపెడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి (73) శుక్రవారం కన్నుమూశారు. మరిపెడ మండలం పురుషోత్తమయాగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌రెడ్డి వారం రోజుల క్రితం గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డోర్నకల్ శాసనసభ నియోజకవర్గంలో క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు ప్రధాన ప్రత్యర్థిగా రాజకీయాల్లో కొనసాగారు. తెలంగాణ ఉద్యమ సమయంలో భారాసలో చేరారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● పురుషోత్తమాయగూడెంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నరేష్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు సంతాపం ప్రకటించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కవుల రాగమై .. జీవన గానమై..!

● బతుకమ్మ పాటల్లో గొప్ప సందేశం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే అత్యంత పవిత్రమైన పండగ బతుకమ్మ. మహిళలంతా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పూజిస్తూ.. ఆటపాటలతో మురిసిపోతారు. ఆ పాటల వెనుక ఎంతో అర్థముంది. ఇవి జానపదాలతో పాటు కవులు, గాయకుల కలం నుంచి జాలువారి ప్రజలను అలరిస్తున్నాయి.. పాటల చరణాల్లోని బావుకత, పూల సొగసుల వర్ణన, జీవన పరమార్థం, ప్రకృతి దేవతల ఆరాధన, సందేశాలు.. ఇలా ఎన్నో దాగి ఉన్నాయి.. మానుకోట, న్యూస్‌టుడే



హనుమకొండ భీమారంలోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఆప్యాయత..

**మా ఇంటి ఆడపడుచువు
అమ్మా.. ఓ బతుకమ్మా
మా పల్లె పూల జల్లువు
అమ్మా.. బతుకమ్మా..
తెలంగాణ మురిసె..
మా చెల్లెలంతా.. మా అక్కలంతా.. మా అమ్మలంతా
బతుకమ్మలాడా..'**



- మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రజాగాయకుడు, వాగ్గేయకారుడు గొడిశాల జయరాజు ఈ పాట రాశారు.

● తన పాటలో బతుకమ్మ వేడుకల వేళ ఆడపడుచుల ఆనందాన్ని.. పూల పర్వదిన సౌందర్యాన్ని వర్ణించారు.

పూల తహతహ..!

**'బతుకమ్మ పండగొస్తే
పూవులన్నీ నవ్వుతాయి..
గడ్డిపూలు గంతులేస్తయ్.. తంగేడు
పూలు తెంపమంటయ్
నునుపుగున్న గునుగు పూలు
గుసగుసలు చెబుతాయి
చెరువులోని తామరలు
తెంపమంటూ తొంగుతాయి
బతుకమ్మ పండుగొస్తెరా.. మా పల్లె తల్లి
పుత్తడి బొమ్మయి పోవురా..
నా తెలంగాణ తల్లి పుత్తడి బొమ్మయి పోవురా..**



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గాయకుడు, గేయ రచయిత కందుల ప్రేంకుమార్ ఈ పాట రాశారు.

● ప్రకృతిలోని రంగు రంగుల పూలు బతుకమ్మలో తమను కూడా చేర్చాలని.. పేర్చాలని.. కోరుకుంటాయని ప్రేంకుమార్ పూల తహతహలను వర్ణించారు. ఒక్కో పువ్వును వర్ణించారు.

ఊరువాడ కలిసేలా..



**'సింగిడిలో.. సింగిడిలో
రంగులన్నీ నేలకొచ్చేనా..
రంగు రంగు పువ్వులయి
ఏకమయ్యేనా.. చెరువంతా
మెరిసేనా..
ఊరువాడా కలిసి.. బతుకమ్మలా పేర్చి
ముత్తయిదువులంతా కలిసి గౌరమ్మను కొలిసెనే..
అందాల పూవులన్నీ ఊయలలూగెనా
మందార పూలన్నీ కోలాటమాడెనా
తామర పువ్వులన్నీ తనువు తడిసెనా
గులాబీ పువ్వులన్నీ పొద్దయిపొడిసెనా
ఊరువాడా కలిసి మొక్కులన్నీ తీర్చి..**

● మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, గాయకుడు అక్షరం ప్రభాకర్ బతుకుతెరువునిచ్చే బతుకమ్మ అంటూ పాటలు రాశారు. నింగిలోని ఇంద్రధనుస్సు బతుకమ్మను చూడడానికి ఒక్కొక్క పూవుగా నేలకు వచ్చినట్లు ఈ పాటలో వివరించారు. పండగ వేళ ఊరంతా ఎలా ఆనందంలో తేలిపోతారో తెలియజేశారు.

సామూహిక అత్యాచార నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులను ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అరెస్టు వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి హనుమాన్‌నగర్‌కు చెందిన తాటి శివరాజ్ కుమార్, పుట్టపాక శరత్ స్నేహితులు. శరత్ ద్వారా బాధిత యువతి మూడు సంవత్సరాల క్రితం శివరాజ్‌కుమార్‌కు పరిచయమైంది. నర్సంపేట లక్నేపల్లిలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కొడం వివేక్ బీటెక్ చదువుతున్నారు. ప్రధాన నిందితుడు శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కూచన మణిదీప్ కుటుంబాల మధ్య స్నేహం ఉంది. ఈక్రమంలో శివరాజ్‌కుమార్ ఇటీవల బాధిత యువతికి తన ప్రేమ విషయాన్ని తెలుపగా ఆమె నిరాకరించి స్నేహితులుగా ఉందామని చెప్పింది. దీంతో యువతిని ఎలాగైనా శారీరకంగా లోబరుచుకోవాలని శివరాజ్‌కుమార్ ఆలోచించాడు. గత నెల 15న శివకుమార్, వివేక్‌లను కలవడానికి మణిదీప్ బిట్స్ కళాశాలకు వచ్చాడు. ముగ్గురు కలిసి ఉండగా శివకుమార్ తన కోరికను వెలిబుచ్చాడు. దీంతో ముగ్గురు కలిసి నగర శివారులో యువతి చదువుతున్న కళాశాలకు వచ్చారు. బాధిత యువతికి శివరాజ్‌కుమార్ ఫోన్ చేసి గుడికి వెళ్దామని చెప్పి కారులో ఎక్కించుకున్నారు. అప్పటికే కారులో మరో ఇద్దరు యువకులు మణిదీప్, వివేక్‌లను చూసి గుడికి వచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆమెను బలవంతంగా ఎక్కించుకున్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని ఓ మద్యం దుకాణంలో బీర్లు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వరంగల్ కూరగాయల మార్కెట్ వద్ద గల ఓ లాడ్జికి తీసుకెళ్లారు. యువతికి మద్యం తాగించి లాడ్జిలో ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి అరుపులతో లాడ్జి సిబ్బంది వచ్చి ప్రశ్నించగా గది నుంచి యువతి, ముగ్గురు యువకులు వెళ్లిపోయారు. అత్యాచారం విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని ఆమెను బెదిరించారు. కళాశాలలో పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లిన యువతి అత్యాచారం విషయాన్ని తల్లికి చెప్పగా ఈ నెల 1న ఇంతేజార్‌గంజ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గురువారం నర్సంపేట మహేశ్వరం వెళ్లే ఓ కచ్చా రోడ్డు వద్ద ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. మణిదీప్‌కు చెందిన కారు, మూడు చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

'కమిటీల పేరుతో కాలయాపన తగదు'



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు అంబాల చంద్రమౌళి

భూపాలపల్లి, న్యూస్‌టుడే : ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని సుప్రీం కోర్టు తీర్పునిస్తే.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ అమలుపై అధ్యయన కమిటీ పేరుతో మాదిగ నిరుద్యోగులకు తీరని నష్టం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు అంబాల చంద్రమౌళి ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఆగమేఘాల మీద ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయడంతో మాలలకు అనుకూలంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తర్వాత ఉద్యోగ నియామకాలు చేపడితే మాదిగలతో పాటు 59 ఉపకులాల వారికి న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆధ్వర్యంలో ఈ నెల 9న నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఇప్పటికే అన్ని మండలాల్లో సభ విజయవంతం కోసం కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాయకులు రాజేందర్, సురేష్ భరత్, భిక్షపతి, రవి పాల్గొన్నారు.

మెరుగైన వసతులు.. వినియోగించుకుంటే మేలు

న్యూస్‌టుడే, భూపాలపల్లి

దేశానికి వెలుగు అందించేందుకు బొగ్గు ఉత్పత్తి చేపడుతున్న సింగరేణిలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమంతో పాటు ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం అనేక సదుపాయాలు కల్పిస్తోంది. ఆటలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందనే ఉద్దేశంతో.. అందుబాటులో మెరుగైన క్రీడా సౌకర్యాలు సమకూర్చింది. వాటిని ఉద్యోగులు, కుటుంబ సభ్యులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఫలితంగా సింగరేణి యాజమాన్యం లక్షలు వెచ్చించి, నిర్మించిన పార్కులు, ఈత కొలను, క్రీడా మైదానాలను అంతంతమాత్రంగానే కార్మిక కుటుంబాల సభ్యులు ఉపయోగించుకుంటున్నారు. ఏరియాలో ప్రస్తుతం సుమారు 5,600 మంది కార్మికులు, అధికారులు ఉన్నారు. యాజమాన్యం కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన క్రీడా స్థలాలను ఆశించిన స్థాయిలో సింగరేణి కార్మిక కుటుంబాల నుంచి క్రీడాకారులు రాకపోవడంతో బోసిపోతున్నాయి.



సింగరేణి క్రీడా మైదానం

సౌకర్యాలివే..

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణకాలనీ ప్రాంతంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో కబడ్డీ, వాలీబాల్ కోర్టు, క్రికెట్ తదితర క్రీడలకు సంబంధించిన కోర్టులు ఏర్పాటు చేశారు. కృష్ణకాలనీ ప్రాంతంలోని సీఈఆర్ క్లబ్‌లో షటిల్ కోర్టు, క్యారమ్, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక నెలకొల్పారు. జిమ్, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశారు. అధికారుల కోసం బంగ్లాస్ ఏరియాలో జిమ్, ఇండోర్ షటిల్ కోర్టు, ధ్యానం కోసం పిరమిడ్ కేంద్రాన్ని, సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో మహిళల కోసం కుట్టుమిషన్లు, ఎంబ్రాయిడరీ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పట్టణంలోని సుభాష్‌కాలనీ, రామప్పకాలనీ ప్రాంతంలో, మినీ సింగరేణి క్వార్టర్లు, టీ2 మోడల్ క్వార్టర్ల ఏరియాలో ప్రత్యేకంగా ఉద్యానవనం ఏర్పాటు చేసి పిల్లల కోసం ఆట వస్తువులు సమకూర్చారు.

జాతీయ స్థాయి వరకు

● భూపాలపల్లి సింగరేణి డివిజన్ నుంచి గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్ల కిందట కోల్ ఇండియా స్థాయిలో ఒడిశాలోని ఎంసీఎల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు రెండు, రజత మూడు, కాంస్య పతకం ఒకటి సాధించి ఆదర్శంగా నిలిచారు.

● భూపాలపల్లిలోని సీఈఆర్ క్లబ్ సమీపంలో సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌లో 2010 నుంచి నేటి వరకు సుమారు 700 మంది వరకు ఈత నేర్చుకున్నారు. పట్టణానికి చెందిన పైడిపెల్లి సాయి 15 రోజుల క్రితం కేరళలో నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్ స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని 'వాటర్ పోలో' విభాగంలో నాలుగు గోల్స్ సాధించి, జాతీయ స్థాయిలో 'బెస్ట్ షూటర్' అవార్డు సాధించారు.



భూపాలపల్లిలో ఈత కొలను

● కేరళలో నిర్వహించిన సౌత్ జోన్ నేషనల్ పోటీల్లో భూపాలపల్లికి చెందిన సూరం సాత్విక్, జల్లి సాయినిఖిల్ పాల్గొని అత్యంత ప్రతిభ చూపించారు. ఈత పోటీల్లో అత్యంత ప్రతిభ చూపించిన వారిలో భూపాలపల్లికి చెందిన ఐదుగురు విద్యార్థులు స్పోర్ట్స్ కోటాలో ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. మరో 15 మంది పైగా మంది ఇంజినీరింగ్ కళాశాల్లో బీటెక్, ఎంబీఏ చదువుతున్నారు.

● బొగ్గు గనుల్లో పనులు చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల పిల్లలు అందుబాటులో అన్ని సౌకర్యాలున్నా.. ఎక్కువ మొత్తంలో ఆడవారి సంఖ్య రోజురోజుకు తగ్గుతోంది. జిల్లా, రాష్ట్ర స్థాయి, సింగరేణి క్రీడల సమయంలో మాత్రం ఆట స్థలాలు కళకళలాడుతున్నాయి. సింగరేణి యాజమాన్యం అందుబాటులోకి తెచ్చిన మైదానాలను సద్వినియోగం చేసుకొని, యువత క్రీడల్లో రాణిస్తే భూపాలపల్లికి మరింత పేరు వచ్చే అవకాశం ఉంది.

మేమున్నాం.. మీకు తోడుగా

టేకుమట్ల: 96032 95502, భూపాలపల్లి: 94408 47097, భూపాలపల్లి రూరల్: 99592 57553 (10 AM TO 1 PM)

కేటీపీపీ ఉద్యోగుల నిరసన



చెల్పూర్, న్యూస్‌టుడే : రామగుండంలో నూతనంగా నిర్మించే థర్మల్ విద్యుత్తు ప్లాంటును జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీజీపీఈజేఏసీ) ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్న భోజన సమయంలో కేటీపీపీ ప్రధాన ద్వారం ఎదుట నిరసన చేపట్టారు. కేటీపీపీ ఉద్యోగులు మాట్లాడుతూ రామగుండంలో నిర్మించతలపెట్టిన 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంటును సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. జీబీ జెన్‌కో ఆధ్వర్యంలోనే ప్లాంటు నిర్మించేలా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీపీఈజేఏసీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

రేగొండ, న్యూస్‌టుడే : కొడవటంచలోని సుప్రసిద్ధ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మహేష్ శుక్రవారం తెలిపారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం సుదర్శన హోమం, కల్యాణ కార్యక్రమం ఉంటుందని ఈవో తెలిపారు.

వ్యాపార కేంద్రం.. సమస్యలమయం

న్యూస్‌టుడే, మహాముత్తారం (భూపాలపల్లి జిల్లా) : మండలానికి యామన్‌పల్లి ప్రధాన వ్యాపార కేంద్రంగా ఉంది. కాటారం-మేడారం ప్రధాన రహదారిపై మండలంలోని గ్రామాలకు కూడలిగా ఉండటంతో కీలకంగా మారింది. ఇక్కడ నిత్యం రద్దీగా ఉంటుంది. మౌలిక వసతులు కల్పించడంలో మాత్రం రాజకీయ నాయకులు, అధికారులు విఫలమయ్యారు. మురుగు కాల్వలు, మరుగుదొడ్లు లేకపోవడంతో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే తాండవిస్తోంది. నీరుపోయే దారిలేక ఏళ్లుగా కుమురం భీం కూడలి వద్ద నడిరోడ్డుపై నిలిచిపోతోంది. వర్షం పడితే గ్రామంలో రెండు కూడళ్లు చెరువులను తలపిస్తున్నాయి. స్వచ్ఛభారత్ మిషన్‌లో 2016 భాగంగా యామన్‌పల్లికి మరుగుదొడ్లు మంజూరవగా గుత్తేదారులకు అప్పగించారు. గుత్తేదారు సగం నిర్మాణాలు చేసి మొత్తం బిల్లులు కాజేశారు. భారాస ప్రభుత్వం రెండోసారి ఏర్పాటయ్యాక ఎంపీపీగా ఎన్నికైన రత్నం సుభద్ర కలెక్టర్‌కు అవినీతిపై ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో గ్రామంలోని వారంతా యామన్‌పల్లి-మహాముత్తారం దారిలో బహిరంగ మలవిసర్జన చేస్తున్నారు. దారంతా కంపుకొడుతున్నా.. నిత్యం జిల్లా ఉన్నతాధికారులు, మండల అధికారులు పట్టించుకోవడం లేదు.



మట్టి కాలువలే దిక్కు...



కుమురంభీం కూడలిలో నిలిచిన మురుగు

మొరాయిస్తున్న వెబ్‌సైట్.. కార్మికుల తంటాలు

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్: కొన్ని రోజులుగా కార్మిక శాఖ వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ.. లేబర్‌కార్డు, ఈ శ్రమ్ కార్డుల ద్వారా ప్రతి కార్మికుడు చిన్న మొత్తంతో బీమా చేసుకోవడం వల్ల వారికి పలు రకాల ప్రయోజనాలను కల్పిస్తోంది. జిల్లాలో భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగ కార్మికులు 27 వేల మంది ఉండగా, అసంఘటిత రంగ కార్మికులు 97 వేల మంది వరకు నమోదు చేసుకున్నట్లు సంబంధిత శాఖ అధికారులు తెలుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తెలంగాణ భవన నిర్మాణ సంక్షేమ పథకంలో నమోదు చేసుకోవాలంటే కేవలం భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగంలో పనిచేస్తున్న 16- 60 సంవత్సరాలలోపు వయసు గల కార్మికులు అర్హులు.. ఇంతవరకు బాగానే ఉన్నా కార్మిక శాఖలో లబ్ధిదారులుగా నమోదైన వారు తమ అవసరాలకు సంబంధించి కార్డుల రెన్యువల్, ఇన్సూరెన్స్ తదితర అంశాలకు సంబంధించి లబ్ధిపొందడానికి ఆన్‌లైన్ పని చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా ఇదే సమస్య ఉండటంతో అర్హులైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఆన్‌లైన్ సేవలను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. కార్మిక శాఖలో ప్రజలకు అందించే వివిధ సేవలు కొన్ని రోజులుగా నిలిచిపోయాయి. కొన్ని రోజుల క్రితం నుంచి ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివాహం, ప్రసూతి, సహజ మరణం, ప్రమాద మరణం, అంత్యక్రియలు, ఆసుపత్రిలో చికిత్స తదితర అవసరాలకు సంబంధించి కార్మికశాఖ తరఫు నుంచి లబ్ధిదారులకు సేవలు అందించాల్సి ఉంటుంది. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ సేవలు నిలిచిపోవడంతో కార్మిక శాఖ తరఫున అందించే సేవలు ప్రజలకు అందడం లేదు. మరోవైపు జిల్లా సహాయ కార్మికశాఖ అధికారి ములుగు, భూపాలపల్లి జిల్లాకు ఒకరే అధికారి కావడంతో విధులు నిర్వహించడంలో ఇబ్బందులు పడుతున్నారని సంబంధిత సిబ్బంది తెలుపుతున్నారు. కార్మికుల అవసరాల నిమిత్తం సరిపడా అధికారులను నియమించడంతో పాటు ఆన్‌లైన్ సేవలు సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.



జిల్లా సహాయ కార్మిక శాఖ కార్యాలయం

నిలువెత్తు.. నిర్లక్ష్యం

పంకెన నుంచి లెంకలగడ్డ వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్తు స్తంభాలు, వృక్షాలు అనేక చోట్ల రోడ్డుపై ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అయిదేళ్ల క్రితం పలిమెల నుంచి మహదేవ్‌పూర్ వరకు రెండు వరుసల రహదారి విస్తరణలో భాగంగా ఈ చెట్లు, స్తంభాలు రహదారి నిర్మాణంలో కలిసిపోయాయి. పలిమెల ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం నిత్యం జిల్లా కేంద్రానికి, మహదేవపూర్, కాటారం వెళ్తుంటారు. తిరుగు ప్రయాణంలో చీకట్లతో ఈ రోడ్డుపై చెట్లను గమనించక వాహనాలు అదుపుతప్పి ఢీకొంటున్నారు. ప్రస్తుతం ఇసుక లారీలు ఈ రహదారిలోనే నడుస్తున్నాయి. స్తంభాలు, చెట్లు ఉన్నచోట అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి వీటిని తొలగించాలని మండలవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పలిమెల(భూపాలపల్లి జిల్లా)**



మెరుగైన వైద్య సేవలు అందించాలి

మల్హర్, న్యూస్‌టుడే : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ తెలిపారు. తాడిచెర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. రోగుల వివరాలు, మందుల నిల్వపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని చెప్పారు. రోగులకు మందుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతల టీకా పంపిణీలో నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో కొమురయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మధుసూదన్

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మల్హర్, న్యూస్‌టుడే : తాడిచెర్ల మానేరు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. భూపాలపల్లి మండలం కాసీంపల్లి గ్రామానికి చెందిన మూడు ట్రాక్టర్లు కిషన్‌రావుపల్లి అటవీ ప్రాంతం నుంచి తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నరేష్ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఐ వాహనాన్ని ఢీకొట్టిన ద్విచక్రవాహనం

నేర సమాచారం

చిట్యాల, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కూడలి వద్ద శుక్రవారం ఓ ద్విచక్ర వాహనం సీఐ వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన పుప్పాల నర్సయ్య, విజయ దంపతులు ద్విచక్ర వాహనంపై తహసీల్దార్ కార్యాలయం రోడ్డు నుంచి తమ గ్రామానికి వెళ్తున్నారు. ఇదే సమయంలో చిట్యాల సీఐ మల్లేశ్ విధుల నిమిత్తం సిబ్బందితో కలిసి ఠాణా నుంచి భూపాలపల్లి వైపు వాహనంలో బయల్దేరారు. ఈ క్రమంలో నాలుగు రోడ్ల మార్కెట్ కూడలి వద్ద ద్విచక్ర వాహనదారుడు సీఐ వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. సీఐ, పోలీసులు వారిని ప్రత్యేక వాహనంలో స్థానిక సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. రెండు వాహనాలు వేగంగా ఉండటంతో ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

రేగొండ : కొడవటంచ గ్రామానికి చెందిన గిరుగుల పాణి ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన విద్యుత్తు ప్రమాదంలో రేకుల ఇల్లు దగ్ధమైంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. పాణి దంపతులు ఇద్దరు పనుల నిమిత్తం పరకాలకు వెళ్లారు. పిల్లలు ఇంటి ముందు ఆటలాడుకుంటున్న సమయంలో మధ్యాహ్నం ఫ్రిజ్‌లో ఒక్కసారిగా గట్టి శబ్ధంతో మంటలు చెలరేగాయి. ఇంట్లో వస్తువులు, రూ.70 వేల నగదు, తులం బంగారం కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ శ్వేత సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబానికి తహసీల్దార్ 25 కిలోల బియ్యం అందజేసి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ నరేష్ ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని మంజూరునగర్ ప్రాంతంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులను లబ్ధిదారులకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పంపిణీ చేశారు. 59 మంది లబ్ధిదారులకు రూ.21.44 లక్షల విలువైన నగదు చెక్కులను అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భూపాలపల్లి, న్యూస్‌టుడే : మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, తాగునీటి సరఫరా తదితర అభివృద్ధి పనులు సకాలంలో, నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక పురపాలక సంఘం పరిధిలో జంగేడు, సుభాష్‌కాలనీ, రాజీవ్‌నగర్, కారల్‌మార్క్స్‌కాలనీలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.39 కోట్లతో శుక్రవారం కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయడానికి అధికారులు కృషిచేయాలని కోరారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యేను పలువురు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కమిషనర్ రాజేశ్వర్, ఏఈ మానస, వార్డు కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, అనిల్, మురళీధర్, రజిత, తదితర నాయకులు పాల్గొన్నారు.



రాజీవ్‌నగర్ సీసీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్

ఫైనల్స్‌కు మహబూబ్‌నగర్, కరీంనగర్ క్రికెట్ జట్లు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-19 క్రికెట్ పోటీల్లో మహబూబ్‌నగర్, కరీంనగర్ జట్లు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతున్నాయి. మొగిలిచర్ల మైదానంలో శుక్రవారం జరిగిన సెమీస్‌లో మహబూబ్‌నగర్ జట్టు ఖమ్మంపై 60 పరుగులతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ (110, 136 బంతుల్లో 114, 26) అద్భుతమైన బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. సాహిల్ 45 పరుగులు చేశాడు. ఛేదనలో బ్యాటింగ్‌కు దిగిన ఖమ్మం జట్టు 39.3 ఓవర్లలో 174 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కోమటిపల్లి మైదానంలో జరిగిన కరీంనగర్, నల్గొండ సెమీస్ మ్యాచ్‌ను హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం హెచ్‌సీఏ సీఈఓ రద్దు చేశారు. నల్గొండ క్రికెట్ సంఘంలో రెండు వర్గాలకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. ఆ వివాదానికి సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం వెలువడటంతో నల్గొండ జట్టు ఆడిన మ్యాచ్‌ను రద్దు చేసి ప్రత్యర్థి జట్టు కరీంనగర్‌ను విజేతగా ప్రకటించినట్లు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. శనివారం మొగిలిచర్ల మైదానంలో ఫైనల్స్ మ్యాచ్ ఉంటుందని చాగంటి శ్రీనివాస్ తెలిపారు.



సెంచరీతో రాణించిన అబ్దుల్(మహబూబ్‌నగర్ జిల్లా)

అలుగు స్వాధీనం.. ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

న్యాశాయంపేట, న్యూస్‌టుడే: ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి అరుదైన వన్యప్రాణి అలుగును స్వాధీనం చేసుకున్నట్లు హనుమకొండ, జనగామ జిల్లాల అటవీశాఖ అధికారి లావణ్య తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో అలుగు విక్రయానికి సంబంధించి కొందరు ఆన్‌లైన్‌లో పెట్టడంతో చెన్నైలోని వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో గుర్తించింది. వెంటనే ప్రాంతీయ ఉప సంచాలకుడు డాక్టర్ కృపాశంకర్ హనుమకొండ అటవీశాఖ, వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్ అధికారులను అప్రమత్తం చేశారు. అటవీ క్షేత్రాధికారి భిక్షపతి, డీఆర్‌వో మోహన్, రతన్‌లాల్, బలరామకృష్ణ వ్యూహంపన్ని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం కొత్తపల్లికి చెందిన తాటి రాజు, ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన అమ్జద్‌ఖాన్, మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన మహ్మద్‌నజీర్‌లను శుక్రవారం కాటారం వద్ద అరెస్టు చేశారు.



వేటగాళ్ల ఉచ్చులో మూగజీవాలు

మహదేవపూర్ : మహదేవపూర్ అటవీ శాఖ రేంజ్ పరిధిలో వేటగాళ్ల వేసిన ఉచ్చులో మూగజీవాలు బలవుతున్నాయి. గత రెండు రోజుల్లో రెండు గొర్రెలు ఇలా మృతి చెందాయి. మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంతంలో వన్యప్రాణుల వేట కోసం ఉచ్చులు పెడుతున్నారు. అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

భూపాలపల్లి, న్యూస్‌టుడే : జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వరకాలనీలో శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు గాయత్రీ అవతారంలో దర్శనమిచ్చారు. ఆర్య వైశ్య సంఘంతో పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మంజూరునగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మహాచండీ యాగం నిర్వహించారు. భారాస జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, తదితర భక్తులు పాల్గొన్నారు.

గణపురం : దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గణపురం మండలం బుద్దారం గ్రామంలోని శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు శుక్రవారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పద్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ భూపాలపల్లి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

కాళేశ్వరం : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని కాళేశ్వరం దేవస్థానం ఆధ్వర్యంలో మహిళలు లలిత సహస్రనామ పారాయణం చేశారు.



వెంకటేశ్వరస్వామి ఆలయంలో చండీ యాగంలో గండ్ర జ్యోతి



బుద్దారంలో అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్ దంపతులు



శుభానందదేవీ ఆలయంలో మహిళల పారాయణం

ప్రజా సమస్యలపై స్పందించాలి



గణపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ సంపత్‌రావు

గణపురం, న్యూస్‌టుడే : గంజాయి నిర్మూలనకు పోలీసు సిబ్బంది కృషి చేయాలని, ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే స్పందించాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు అన్నారు. శుక్రవారం గణపురం ఠాణాలో వార్షిక తనిఖీ చేపట్టి వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. పోలీసు సిబ్బంది పనితీరు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, డయల్ 100 పనితీరు, కోర్టు ప్రాసెసింగ్, వర్టికల్స్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డయల్ 100కు వెంటనే స్పందించాలని అలాగే సమస్యలతో వచ్చే ప్రజల పట్ల మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చిట్యాల సీఐ మల్లేశ్, గణపురం ఎస్సై ఆర్.అశోక్, మహిళా ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

కాళేశ్వరం, న్యూస్‌టుడే : కాళేశ్వరం గోదావరి నదిలో ఆత్మహత్యకు పాల్పడేందుకు వచ్చిన మహిళను కాళేశ్వరం పోలీసులు రక్షించి ఠాణాకు తరలించారు. ఎస్సై చక్రపాణి తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన ఓ మహిళ(62) తన వద్ద ఉన్న డబ్బులను ఇతరులకు అప్పుగా ఇస్తుంది. విషయం తెలుసుకున్న ఆమె కుమారులు మాకు తెలియకుండా ఇలా ఎందుకిస్తున్నావని కోపడ్డారు. దీంతో మహిళ మనస్తాపానికి గురై కాళేశ్వరం వచ్చింది. గోదావరి ఒడ్డున అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వెంటనే వెళ్లి ఆమెను కాపాడి ఠాణాకు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కుమారులు, బంధువులకు సమాచారం అందించారు.

భారాస మండలాధ్యక్షుడి నియామకం

చిట్యాల, న్యూస్‌టుడే : భారత రాష్ట్ర సమితి చిట్యాల మండల నూతన అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన అల్లం రవీందర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తన నివాసంలో అల్లం రవీందర్‌ను శాలువాతో సత్కరించి నియామక పత్రాన్ని అందించారు. తన నియామకానికి సహకారం అందించిన వారికి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు సాగర్, పీఏసీఎస్ ఛైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, యూత్ మండలాధ్యక్షుడు నవీన్, అశోక్ రెడ్డి, శంకర్, రవీందర్‌రావు పాల్గొన్నారు.



అల్లం రవీందర్

'అసత్య ఆరోపణలు చేస్తే సహించం'

కాటారం, న్యూస్‌టుడే : మంథని నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబుపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. మంత్రిపై భాజపా నేత చల్లా నారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. పలు పార్టీలు మారి రాష్ట్ర నాయకుడిగా చెప్పుకుంటూ చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై చేసిన ధర్నాలో పోలీసులు చట్టపరంగా కేసు నమోదు చేస్తే మంత్రికి ఆపాదించడం సరికాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘువీర్, రవీందర్‌రావు, కుమార్, గట్టయ్య, రాజు, మహేష్, తిరుపతి పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

భూపాలపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ప్రజా పరిపాలన పూర్తిగా స్తంభించిపోయిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కన్నం యుగేందర్, జిల్లా నాయకులు డి.రాజేందర్ విమర్శించారు. శుక్రవారం ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తీగల జగ్గయ్య, నాంపెల్లికుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన యుగేందర్, రాజేందర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత ఏర్పడిందని, పేదల సంక్షేమాన్ని పట్టించుకోకుండా హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో పేదల ఇళ్లు కూల్చివేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో కె.రాజయ్య, హరీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.